క్లుప్తంగా

దీప్తి జీవాంజికి సన్మానం



పర్వతగిరి: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజి ఇటీవల జరిగిన పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన నేపథ్యంలో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం దీప్తిని ఆమెను సన్మానించి అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రపంచ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, జంగిలి కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల భాస్కర్, చిన్నపెల్లి దేవేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

సంగెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీఆర్ఎన్ తండాకు బానోత్ బాలు(42)కు ప్రమీలతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నవ్య, వెంకటేశ్‌లు సంతానం. కూతురు నవ్య పెళ్లి జరిపించారు. కుమారుడు చదువుకుంటున్నాడు. మద్యానికి బానిసైన బాలు తరచూ భార్య ప్రమీలతో గొడవ పడి కొడుతుండడంతో కొంతకాలం క్రితం ప్రమీల పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 15వ తేదీన బాలు పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడు. బాలు తల్లి సుకిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

విలీన సభను జయప్రదం చేయండి



చెన్నారావుపేట: టీయూసీఐలోకి ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. ఈ మేరకు టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు విలీనసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా కార్మికవర్గంపై దాడి తీవ్రమవుతున్న తరుణంలో దాడిని ఎదుర్కొంటున్న బలమైన కార్మిక సంఘం ఏర్పాటు కోసం ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ కమిటీ నాయకులు బానోతు జవహర్‌లాల్, మోతె వీరారెడ్డి, వల్ల ఉప్పలయ్య, మాదాసి శ్రీను, భిక్షపతి, రాజు, పాషా, తదితరులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

నెక్కొండ: మానవ అక్రమ రవాణా నిర్మూలిద్దామని వాక్ ఫర్ ఫ్రీడం, శ్రీధరణి స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఈదునూరి రమేశ్ అన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన పోస్టర్‌ను ఎస్సై మహేందర్‌తో కలిసి శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడక్కడ మానక అక్రమ రవాణా ఘటనలు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శనివారం మండల కేంద్రంలో పోలీస్, విద్య, వైద్య, ప్రభుత్వేతర సంస్థల సౌజన్యంతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గుడుంబా, రెండు వాహనాలు సీజ్



నర్సంపేట రూరల్: గుడుంబా తరలిస్తున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట రోడ్డులో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్శనాయక్ తండాకు చెందిన బానోత్ రాజేంద్రప్రసాద్, బానోత్ సాంబయ్య గుడుంబా రవాణా చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వీరి నుంచి 11 లీటర్ల గుడుంబా, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్సైలు శార్వాణి, జాన్న, సిబ్బంది రామ్మూర్తి, దిలీప్, రంజిత్, హైమద్, వినోద్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పక్కన అధికారులు

రాయపర్తి: ప్రజలకు అందుబాటులో ఉండి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపు మరమ్మతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాటర్‌ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయడంతోపాటు పరిశుభ్రమైన నీటిని అందించాలని సూచించారు.

పరామర్శ..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్ర రాజు, ఈదునూరి అన్వేశ్ కుటుంబాలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ కిషన్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ అనూష, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, సోమేశ్వరాలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గోవర్దన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, నర్సయ్య, నర్సింహారెడ్డి, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సరఫరా సక్రమంగా నిర్వహించాలి

ఖానాపురం: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సక్రమంగా అందించాలని మిషన్ భగీరథ ఎస్ఈ సురేందర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మోటార్లపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచినీటి సరఫరా కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, ప్యానల్ బోర్డు, ఎలక్ట్రికల్ పరికరాలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన గ్రామ మంచీనటి సహాయకులే పరిష్కరించుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా మోటార్లకు సమస్యలు వస్తే పరిష్కరించుకోవాలని తెలిపారు. మంచినీటి సరఫరా ఎక్కడా ఆగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ డీఈఈ దేవేందర్‌రెడ్డి, డీఎల్‌పీఓ రాజీవ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మౌనిక, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం



కుమారస్వామి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన బాల్య కుమారస్వామి శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఎంజీఎం పోస్టుమార్టం వద్ద మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాలుగా ఆదుకుని కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు యాకయ్య, భాస్కర్ల చందన్, గ్రామస్తులు దోమటి శ్రీకాంత్, రాజు, వీరన్న, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న దాత రాకేశ్‌రెడ్డి

సంగెం: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. ఈ కెమెరాలతో నేరాలు అదుపులో ఉంటాయని మాదిరెడ్డి రాకేశ్‌రెడ్డి అన్నారు. గీసుకొండ మండలంలోని బొడ్డు చింతలపల్లిలో తన సొంత ఖర్చులతో 15 సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఏమైన అవాంఛనీయ సంఘటనలు జరిగే వెంటనే నిందితులు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలుకలుగుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణి, మాజీ సర్పంచ్‌లు యుగేందర్, హరికృష్ణ, గ్రామస్తులు మోహన్, భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వొద్దు



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

రాయపర్తి: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలతోపాటు తిర్మలాయపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిర్యాదుల పెట్టెలో అధిక మొత్తంలో ఫిర్యాదులు రావడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశీలించడంతోపాటు మధ్యాహ్న భోజన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదుల ఫిర్యాదుల పెట్టెలో తమ ఫిర్యాదులు నమోదు చేయాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలు తమ దృష్టికి వస్తే గురుకులంతోపాటు కస్తూర్బా పాఠశాలను సందర్శించనున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటరమణ, శ్రీధర్

వర్ధన్నపేట: బీజేపీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్క నాయకుడు, ఇన్‌చార్జ్‌లు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆ పార్టీ సంయుక్త మోర్చాల ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామంలోని దళిత బస్తీలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి సాధించిందన్నారు. ఇకనైనా ప్రజలు గమనించి బీజేపీని ఆదరించాలన్నారు. బీజేపీ పథకాలు, విధానాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యకర్తలు కృషిచేసి లక్ష్యం మేరకు సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. బీజేపీలో చేరిన సుమారు 200 మందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాది తిరుపతిరెడ్డి, కార్యదర్శి జడ సతీష్, జిల్లా ప్రముఖ్ నాంపల్లి యాకయ్య, నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, రామిండ్ల బాబురావు, రాయపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దు



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహేశ్వరం, రాములునాయక్‌తండా ప్రజలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం, రాములునాయక్‌తండా గ్రామాలను నర్సంపేట మున్సిపాలిటీలో కలిపేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తుందని, తక్షణమే నిలిపివేయాలని మహేశ్వరం గ్రామ బీఆర్ఎస్ నాయకులు పద్మనాభరెడ్డి, మాజీ సర్పంచ్ అంగోతు సుధాకర్ లాల్ డిమాండ్ చేశారు. నర్సంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం, రాజపల్లి గ్రామపంచాయతీల పరిధిలో ఉండే ప్రజలందరు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారన్నారు. మున్సిపాలిటీలో కలిపితే వ్యవసాయ ఆధారిత కూలీలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రాకుండా అన్యాయం జరుగుతుందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని, తక్షణమే నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గౌతమ్, రాజు, రాజేందర్, రాజిరెడ్డి, రాజేందర్, సమ్మయ్య, స్వామి, శ్రీను, వీరన్న, కోడిశ్వర్, రమేశ్, గణేశ్, బొల్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బియ్యం అందజేస్తున్న నాయకులు

చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పడిదం కట్టస్వామి భార్య నవనీత(45) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ తదితరులు నవనీత మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని, రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ భరత్, సారయ్య, వీరు, పెద్దవీరు రాజేందర్, శివ, తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

పర్వతగిరి: మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన పంతంగి ఉప్పలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అత్తి కుమారస్వామి 50కేజీల బియ్యం అందజేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బలే రాజుగౌడ్, రాజు, రవి, నర్సయ్య, కుమారస్వామి, రమేశ్, కొమురయ్య ఉన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ: నేటి యువత చెడు మార్గాలను వీడి క్రీడపై దృష్టి సారించాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొట్లకొండ గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు రంజిత్‌రెడ్డి బహుమతులను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కీడలకు పెద్ద పీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షుడు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు చల్లా శ్రీపాల్‌రెడ్డి, కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, కునుసోతు నైజాం నాయక్, భూక్య జనార్దన్, యూత్ అధ్యక్షుడు గుగులోతు వెంకన్న, మహేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో పారదర్శకత పాటించాలి



నర్సంపేట రూరల్: ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఇందిరమ్మ గ్రామకమిటీల్లో పారదర్శకతంగా పాటించాలని బీఆర్ఎస్ పార్టీ నర్సంపేట మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. నర్సంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట మండలంలోని అన్ని ఆరు గామాల్లో పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరికి గ్రామసభలు లేకుండా కమిటీలను ఏకపక్షంగా అనధికారికంగా వేస్తున్నట్లు తెలిపారు. దీంతో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు దక్కే అవకాశం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ కమిటీలను పారదర్శకంగా వేసి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, మండల సర్పంచ్‌లు పోరం మాజీ అధ్యక్షుడు కోడారి రవి, నర్సయ్య గౌడ్, మోతి పద్మనాభరెడ్డి, రవి, రమేశ్, గోపాల్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: ఇందిరమ్మ కమిటీలను గ్రామసభలు ఏర్పాటు చేసి పాదర్శకంగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామస్తుల ఆమోదంతో కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎటువంటి గ్రామసభలు ఏర్పాటు చేయకుండా కేవలం తమ పార్టీ కార్యకర్తల పేర్లను కమిటీలో ప్రతిపాదించి ఎంపీడీఓకు అందజేయడం హాస్యాస్పదంగా ఉందని వాపోయారు. మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ ఆత్మ చైర్మన్ గోపాల్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజమణి, అనిత, శ్రీనివాస్, శ్రీను, భాస్కర్‌రావు, సంపత్‌రెడ్డి, ఉమ, యతిరాజ రావు, సోమయ్య, కుమారస్వామి, వేణుగోపాల్, జ్యోతి తదితరులు ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

వర్ధన్నపేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని వరంగల్-ఖమ్మం రహదారిపై ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. నగర కార్యదర్శి జీవన్, నాయకులు శివమణి, ప్రశాంత్, కార్తీక్, సన్నీ ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



పాఠశాలలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

సంగెం: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో కష్టపడి చదివి ఉజ్వలమైన భవిష్యత్‌ను రూపొందించుకోవాలని ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం తన స్వగ్రామమైన కాపులకనిపర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఎంఆర్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మమత, లింగమూర్తి, ఉపా ధ్యాయులు సీతాదేవి, రాజన్న, పద్మజ, స్వప్నకుమారి, వెంకన్న, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ

చెన్నారావుపేట: మండలంలోని జల్లీ హైస్కూల్, కస్తూర్బాగాంధీ బాలికలు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ సరళ తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులను ఎంఈఓ సరళ, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ జ్యోతి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీల్లో జల్లీ హైస్కూల్‌కు చెందిన దీక్షిత, చిట్టి, ఆశ్రిత, అంజలి, మల్లీశ్వరి గ్రూప్ డ్యాన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని బి.అనూష పాటల పోటీలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వాన్ని అందజేస్తున్న యూనియన్ బాధ్యులు

వర్ధన్నపేట: మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరిన 9 మంది ఉపాధ్యాయులను పీఆర్టీయూలోకి ఆహ్వానించి సభ్యత్వ నమోదు చేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మ మనుజేందర్‌రెడ్డి, వెంగల అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇల్లంద, కట్ర్యాల, రాంధాన్ తండా, బండౌతపురం, గుబ్బేటి తండా, డీసీ తండా, వంశీరాజ్ నగర్, చెన్నారం ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీఆర్‌టీయూ మండల శాఖ నాయకులు పర్యటించి జ్యోతి, లోకేందర్‌రెడ్డి, స్వర్ణలత, శ్రవణ్‌కుమార్, ఆమని, స్వప్న, కవిత, సంధ్య, సంపత్ కుమార్‌లకు సభ్యత్వాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగ కన్వీనర్ సమ్మారెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు తమ్మి దయాకర్, ఉపాధ్యక్షురాలు కూరాకుల సుజాత, కుమార్, కిషోర్, సర్వన్, కుమారస్వామి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆయా పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులను ఎంఈఓ శ్రీధర్, ఇల్లంద, వర్ధన్నపేట కాంప్లెక్స్ హెచ్ఎంలు విజయ, రమణరావులు అభినందించారు.

శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి

ఖానాపురం: ఉద్యోగ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని బుధరావుపేట హైస్కూల్ హెచ్ఎం ఆరీఫ్‌హుస్సేన్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు శుక్రవారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే శ్రీపాల్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి తదితరులు ఉన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపురం/ నల్లబెల్లి: పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహలక్ష్మి వెంకటనర్సయ్య, నల్లబెల్లి మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖానాపురం మండలంలోని వేపచెట్టుతండా, నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లిలో పత్తి పంటలను శుక్రవారం పరిశీలించి, పత్తి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెడితే అకాల వర్షాలతో పూత, కాత రాలిపోయి దిగుబడి లేక నష్టపోతున్నారన్నారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారని, పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం రెండు క్వింటాళ్లు మాత్రమే వస్తుందన్నారు. వచ్చిన కొద్దిపాటి దిగుబడిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, వెంకన్న, అశోక్, యాకుబ్‌పాషా, యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్, ప్రవీణ్ గౌడ్, శివారెడ్డి, మంజీలాల్, బాలరాజు, దేవ్‌సింగ్, ఫూల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



పవన్ కుమార్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం శ్రీదేవి

నల్లబెల్లి: మండలంలోని రాంతీర్థం ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వచ్చిన ధరావత్ పవన్ కుమార్‌ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయురాలు అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు అధికంగా నాటాలి



మొక్క నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఖానాపురం: ప్రజలు, విద్యార్థులు మొక్కలు అధికంగా నాటాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సదానందం, అధ్యాపకులు రవికుమార్, తిరుపతమ్మ, సంజీవ, రాజేశ్, విజయ్‌కుమార్, కృష్ణమూర్తి, సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.